

## భారతీయ స్త్రీల గొంతుకలు

1. సుచేత కృపలానీ, 2. విజయలక్ష్మీ పండిట్
3. సరోజిని నాయుడు, 4. దుర్గాబాయి దేశ్‌ముఖ్
5. రాజకుమారి అమృత్ కౌర్, 6. అమ్ము స్వామి నాథన్, 7. దాక్షాయణి వేలాయుధన్,
8. బేగం ఐజాజ్ రసూల్,
9. హంస జీవరాజ్ మెహతా
10. అన్నీ మాస్కరీన్, 11. లీలా రాయ్,
12. మాలతి చౌదరి, 13. పూర్ణిమ బెనర్జీ
14. రేణుక రాయ్, 15. కమల చౌదరి

### మూడు అంచెల ప్రభుత్వం

భారత రాజ్యాంగం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలనే పేర్కొన్నది. న్యాయ సంరక్షణ లేని ఆదేశిక సూత్రాల్లో మాత్రం 40వ అధికరణలో పంచాయతీల ఏర్పాటు గురించి ప్రస్తావించారు. వీటి ఏర్పాటుకు పార్లమెంటు చట్టం చేయాల్సి ఉంటుంది. ఈ క్రమంలో 1992లో 73వ రాజ్యాంగ సవరణ ద్వారా గ్రామాల్లో పంచాయతీ రాజ్ వ్యవస్థకు, 74వ సవరణ ద్వారా పట్టణాల్లో మునిసిపాలిటీలకు కూడా రాజ్యాంగ హోదా కల్పించారు. అలా దేశంలో మూడో అంచె ప్రభుత్వాలు ఏర్పాటయ్యాయి. పరిపాలన మరింతగా ప్రజలకు దగ్గరయ్యింది.

### ఆదేశిక సూత్రాలు

ఆదేశిక సూత్రాలను రాజ్యాంగంలో నాలుగో భాగంలో అధికరణలు 36 నుంచి 51 వరకు పేర్కొన్నారు. దేశ పౌరుల పట్ల రాజ్యం ఏది చేయకూడదో ప్రాథమిక హక్కులు చెబుతాయి. ఆదేశిక సూత్రాలేమో ప్రజల సంక్షేమానికి రాజ్యం ఎలాంటి చర్యలు తీసుకోవాలో నిర్దేశిస్తాయి. అందుకే వీటిని 'రాజ్య విధాన నిర్దేశక నియమాలు' (డైరెక్టివ్ ప్రిన్సిపుల్స్ ఆఫ్ స్టేట్ పాలిసీ) అని కూడా పిలుస్తారు. వీటిని ఐర్లాండ్ దేశపు రాజ్యాంగం నుంచి గ్రహించారు. ప్రాథమిక హక్కులు రాజకీయ న్యాయానికి వీలు కల్పిస్తే.. ఆదేశిక సూత్రాలు సామాజిక, ఆర్థిక న్యాయానికి హామీ ఇస్తాయి. అయితే, వీటిని ప్రభుత్వాలు వీలును బట్టి అమలుచేస్తాయి. కాబట్టి, ఆదేశిక సూత్రాలకు న్యాయ స్థానాల నుంచి రక్షణ లేదు. అందుకే వీటిని మనం జనవరి 1వ తేదీనాడు తీసుకునే తీర్మానాల వంటివి అనే విమర్శలు ఉన్నాయి. అయినప్పటికీ... ప్రభుత్వాలు ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోకపోతే ఎన్నికల సమయంలో ప్రజలకు జవాబు చెప్పాల్సి ఉంటుంది కాబట్టి వీటిని విస్మరించలేరనేది రాజ్యాంగ నిర్మాతల ఆలోచన.

ఆర్థిక, సామాజిక, అవకాశాల పరంగా అసమానతలు లేని సమాజ నిర్మాణం, స్త్రీలు, పురుషులకు సమాన పనికి సమాన వేతనం, వనరులు ఒక్కరు లేదా కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతం కాకుండా చూడటం, శ్రమదోపిడీని నివారించడం, పేదలకు ఉచిత న్యాయ సహాయం, గ్రామ పంచాయతీల ఏర్పాటు, దేశ ప్రజలందరికీ ఉమ్మడి (ఒకే) పౌరస్మృతి లాంటివి ఆదేశిక సూత్రాల్లో భాగం. న్యాయ సంరక్షణ లేనప్పటికీ స్వతంత్రం వచ్చినప్పటి నుంచి ఏర్పాటైన ప్రభుత్వాలు వీటి అమలుకు కృషిచేస్తూనే ఉన్నాయి.

* * *

ఒక దేశ పాలనలో అనుసరించాల్సిన మౌలిక చట్టమే రాజ్యాంగం. దేశ ప్రజల హక్కులు, సంక్షేమం దృష్ట్యా చూస్తే భారత రాజ్యాంగం అత్యుత్తమమైన రచన. అయితే, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ చెప్పినట్టు ''రాజ్యాంగం ఎంత గొప్పది అయినప్పటికీ, దాన్ని అమలు చేసేవాళ్లు మంచివాళ్లు కాకపోతే ప్రయోజనం ఉండదు. ఒకవేళ రాజ్యాంగం ఎంత చెడ్డది అయినప్పటికీ, అమలు చేసేవాళ్లు మంచివాళ్లయితే అది గొప్పగా ఉంటుంది''. కాబట్టి, ప్రభుత్వాలు, ప్రజలు రెండు వైపుల నుంచి రాజ్యాంగ లక్ష్యాలను సాధించడానికి ప్రయత్నిస్తేనే ఒక దేశంగా భారతదేశం గొప్పదిగా నిలుస్తుంది.

## రాజ్యాంగ మౌలిక స్వరూపం



కేశవానంద భారతి కేరళ రాష్ట్రంలోని కాసరగోడ్ జిల్లాలో ఓ హిందూ మఠానికి అధిపతి. ఆ మఠంలో భూమికి ఆయన యజమాని. అయితే, 1969లో కేరళ ప్రభుత్వం భూ సంస్కరణల చట్టం తీసుకువచ్చింది. దీనికింద మఠానికి చెందిన కొన్ని భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకునే హక్కు తమకు ఉందని ప్రభుత్వం పేర్కొన్నది. దీంతో 1970 మార్చిలో కేశవానంద భారతి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు 14, 19 (1) (f), 25, 26, 31 అధికరణల కింద ఆస్తిని కలిగి ఉండటం ప్రాథమిక హక్కు అని ఆయన వాదించారు.

ఈ నేపథ్యంలో 1973 ఏప్రిల్ 24న సుప్రీంకోర్టు తుది తీర్పు ప్రకటించింది. అప్పటి ప్రధాన న్యాయమూర్తి ఎస్.ఎం. సిక్రి నేతృత్వంలోని 13మంది సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం 7:6 తేడాతో... రాజ్యాంగంలోని ఏ అధికరణాన్ని అయినా సవరించే అధికారం పార్లమెంటుకు ఉందని తీర్పుచెప్పింది. అయితే, రాజ్యాంగ ప్రాథమిక స్వరూపం దెబ్బతినకుండా ఆ సవరణలు ఉండాలని షరతు విధించింది. **రాజ్యాంగ ఆధిక్యత, న్యాయ వ్యవస్థకు సంబంధించిన అంశాలు, అధికారాల విభజన, న్యాయ వ్యవస్థ స్వతంత్రత** మొదలైన అంశాలు రాజ్యాంగ మౌలిక స్వరూపం కిందికి వస్తాయి. చివరికి 1978లో 44వ రాజ్యాంగ సవరణ ద్వారా ఆస్తి హక్కును ప్రాథమిక హక్కుల జాబితా లోంచి తొలగించారు.

